క్లుప్తంగా

సచివాలయం తనిఖీ

సంతకవిటి: మండలంలోని హొంజరాం సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆధార్ డ్రైవ్‌ను పరిశీలించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు.

ధర్మాన్ని అనుసరించాలి

రేగిడి: ప్రతిఒక్కరు ధర్మాన్ని కాపాడాలని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు సాయిమురళీ మాస్టార్ అన్నారు. రేగిడి విశ్వసాయి మందిరం వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ మంచిమార్గంలో నడవాలని సూచించారు. ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. అనంతరం మాస్టార్‌ను సత్యసాయి భజనమండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, లావేటి విష్ణు, తదితరులు ఘనంగా సత్కరించారు.

చురుగ్గా భూ సర్వే



కందిశలో హద్దుల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం, కందిశ, తదితర గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు పథకం సర్వే చురుగ్గా జరుగుతోందని తహసీల్దార్ టి. కల్యాణచక్రవర్తి తెలిపారు. ఈ మేరకు కందిశలో బుధవారం భూహద్దుల ఏర్పాటును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సమక్షంలో సర్వే పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కెల్ల మన్మధరావు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు పునాది

వంగర: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు పునాది వేయాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ పెర్ఫార్మెన్స్ ఎవెల్యూషన్ టూల్ (ఎస్‌పీఈటీ) అనే అంశంపై డీఆర్‌పీ ప్రసాద్ వివరించారు.

పరామర్శ



సూరీడమ్మ కుటుంబీకులను పరామర్శిస్తున్న జగన్ మోహనరావు

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామానికి చెందిన లెంక సూర్యనారాయణ కుటుంబ సభ్యులను జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహనరావు బుధవారం పరామర్శించారు. వారం రోజుల కిందట సూర్యనారాయణ భార్య సూరీడమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్‌చైర్మన్ గ్రామానికి చేరుకుని సూర్యనారాయణతో పాటు ఆయన కుమారులు జగన్, విజయభాస్కర్‌లను కలిసి ఓదార్చారు. కార్యక్రమంలో లెంక భాను, శ్రీధర్, ఉదయ్‌భాస్కర్, శేషగిరి, తూలుగు ప్రసాద్, వావిలపల్లి సన్యాసినాయుడు, గురువు సింహాచలం, రాము, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ పనుల పరిశీలన

రాజాం సిటీ: మండల పరిధిలోని గడిముడిదాం గ్రామ సమీపంలో తోటపల్లి కాలువలో చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ కె.సాయిరాం బుధవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరుకావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రెండుపూటలా పనులు చేస్తే 272 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: రైతులు, ప్రజలు ఆరుబయట తిరిగే సమయంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని అంబకండిలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 124 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎండలు మండుతున్న నేపథ్యంలో మంచినీరు, మజ్జిగ, గ్లూకోజ్, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు పి.సత్యవతి, యోగా ఇన్‌స్ట్రక్టర్ ఎం.రామకృష్ణ, పి.శైలజ, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ పిల్లిరాజు పాల్గొన్నారు.



బొబ్బిలి: పాతబొబ్బిలిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ పెదరాములు, రాజారావు



వంగర: కొండచాకరాపల్లిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, తదితరులు



రేగిడి : సరసనాపల్లిలో స్టిక్కర్లు అంటిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు తదితరులు.

జగనన్న వెంటే జనం..



రాజాం : పట్టణ పరిధిలోని మాదిగవీధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు



రేగిడి : తోకలవలసలో ప్రచారం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్, తదితరులు



రామభద్రపురం: ఆగురువీధిలో సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలన చూసి అన్నివర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి అవినీతి లేకుండా పారదర్శకంగా పథకాలు మంజూరు చేస్తుండడంతో 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. పేదలను ఆదుకుంటున్న మనసున్న మారాజు జగనన్నను మరోసారి గెలిపించుకుంటామని చెబుతుండడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్

నిర్వహణ పేరుతో బిల్లులు డ్రా..!

- వర్కు బోర్డుల ఏర్పాటులో నిధులు పక్కదారి
- సోషల్ ఆడిట్‌లో గుర్తింపు

మెంటాడ: మండలంలో ఉపాధిహామీ పనుల్లో భాగంగా గత ఏడాది 16వేల మొక్కలు నాటిగా.. ప్రస్తుతం మూడు వేల మొక్కలకు మించి లేవని, కానీ మొక్కల సంరక్షణ పేరుతో బిల్లులు డ్రా చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని ప్రొసీడింగ్ అధికారి వి.వి.ఎస్ లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలో ఉపాధిపనులపై ఎంపీడీఓ తివిక్రమ్ ఆధ్వర్యంలో బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ పంచాయతీలో చూసినా 70 శాతం మొక్కల నిర్వహణ అంటూ తూతూ మంత్రంగా చేసినట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. అలాగే వర్క్‌బోర్డులు ఏర్పాటు చేయనట్లు గుర్తించామన్నారు. గుత్తేదారులకు కాంట్రాక్ట్ ఇచ్చినట్లు, ఖర్చు చేసిన నిధులకు కూడా పక్కాగా లెక్కలు చూపించడం లేదనే విషయం మాదృష్టికి వచ్చిందన్నారు. ఈ ఏడాది సామాజిక తనిఖీలో ఉపాధిహామీ అధికారులకు సంబంధించి బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వహించినట్లు స్పష్ట మౌవుతోందన్నారు. దీనికి సంబంధించి రికవరి చేయించి ఉన్నతాధికారులు నోటీసులకు నివేధికను తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఎంపీపీ ఆర్.ఎస్ నాయుడు మాట్లాడుతూ చిన్నపాటి పొరపాట్లు క్షేత్రసహాయకులు చేసినట్టయితే మొదటి తప్పుగా భావించి విడిచిపెట్టాలని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా నిఘాధికారి ఎస్.రవీంద్ర, ఏపీడీ టి.జనార్దనరావు, ఎస్‌ఆర్‌పీ కేవీ అప్పలనాయుడు, ఏపీఓ బి.చిన్నప్పయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

అర్హులకు పథకాలు వర్తింపచేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తెర్లాం: సచివాలయం పరిధిలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. మండలంలోని గంగన్నపాడు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఉద్యోగులు, వలంటీర్ల బయోమెట్రిక్, ఫేషియల్ హాజరును, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, ఈ–సర్వీసుల ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వం సూచించిన ఖాతాలో జమచేయాలని సూచించారు. ప్రతీరోజూ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, అన్ని శాఖల సిబ్బంది పాల్గొనేలా పంచాయతీ కార్యదర్శి చూడాలన్నారు.

మార్కింగ్ ప్రకారం హద్దురాళ్లు వేయాలి

తెర్లాం: భూముల సరిహద్దుల గుర్తింపు పూర్తయి, సచివాలయ సర్వేయర్లు మార్కింగ్ ఇచ్చిన ప్రదేశంలోనే హద్దురాళ్లు వేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ గొంగాడ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొరటాం, చుక్కవలస గ్రామాల్లో బుధవారం హద్దురాళ్లు పాతే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలను ఉద్దేశించి వారు మాట్లాడారు. సర్వేరాళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. వేతనదారులు మార్కింగ్ ఇచ్చిన ప్రదేశంలో హద్దురాళ్లు వేస్తున్నారా, లేదా పరిశీలన చేయాలని కోరారు.

డీఏఓఏపీజీడబ్ల్యూఎస్ నూతన కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులు

సంతకవిటి: మండలంలోని తాలాడలో బుధవారం జరిగిన డెమాక్రాటిక్ అసోషియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయం సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గరుగుబెల్లి కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జి. జోసెఫ్ కిశోర్ మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్. లోకేష్, కార్యదర్శిగా బి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా ఎస్.రమేష్, సహాయ కార్యదర్శిలుగా జి.రమణ, జి.సాగర్ ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎస్.రమేష్‌కుమార్, బి. చక్రధర్, ఉమెన్ ప్రెసిడెంట్‌గా పి. విశాలాక్షి, ఉమెన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.సంతోషికుమారి, కార్యవర్గ సభ్యులుగా ఉమాపతి, మాధవి, రాము, దిలీప్, లక్ష్మణరావు, వాసు, గౌరి, స్వాతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులను సత్కరించారు.

ఎమ్మెల్యే పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడివలస గ్రామానికి చెందిన మరడ అప్పలనాయుడు పిడుగుపాటుకు గురై మంగళవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడొద్దని, అన్ని విధాలా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి తక్షణ సాయం అందేలా చూడాలని అధికారులకు ఫోన్ చేసి చెప్పారు. ఆయన వెంట సర్పంచ్ చింతల రామారావు, నీరజ, అచ్యుతరావు తదితరులున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి



ప్రచారసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి శూన్యమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సెక్టార్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీసి పేదల ఖాతాల్లో రూ. 15 లక్షలు జమచేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించి దేశాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒ.రమణమూర్తి, టి.సూర్యనారాయణ, పి.కృష్ణ, కె.సురేష్, విశ్వనాథం, త్రినాథ్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను విజయవంతం చేయండి

బొబ్బిలి: పట్టణంలో కలాసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు బోగాది అప్పలస్వామి, దంతులూరి వర్మలు కోరారు. బుధవారం పట్టణ కళాసీ సంఘ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మే 1న నిర్వహించే ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరారు. యరబాల అప్పారావు, పిరిడి అప్పారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పీకేఎస్ ఆధ్వర్యంలో..

ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తమటాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో మేడే వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. గంటి ప్రసాదం స్మారక భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాయితి సత్యం, తూఐముల సింహాచలం, నల్లి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే..

తెర్లాం: భూములను సమగ్రంగా, త్వరితగతిన సర్వే చేసేందుకు డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని లోచర్ల గ్రామంలో బుధవారం డ్రోన్ సాయంతో భూసర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేకు రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ల్యాండ్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు, మండల సర్వేయర్, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో

ప్రజలకు ఎనలేని సంక్షేమం



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, తదితరులు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఎనలేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని అలజంగిలో 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గతం సంక్షేమ పథకాలు కేవలం ఆ పార్టీకి సంబంధించిన కొద్దిమందికి మాత్రమే అందేవని, మిగతా వారు అర్జీలు చాచేలా చూసినా దక్కేవి కాదన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వాటిని అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, సర్పంచ్ రేజేటి భద్రమ్మ, నాయకులు అలజంగి చిన్న, పొట్నూరు లక్ష్మునాయుడు, రేజేటి బుజ్జి, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం

- ఎమ్మెల్యే కంబాల జోగులు



లబ్ధిదారులకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఈ విషయంలో ప్రజలు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండల పరిధిలోని మండాకురిటి పంచాయతీ పరిధి పోతురాజుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుతోపాటు ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తోందని, ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్ మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, స్థానిక సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, పప్పల గణపతి, చిత్తారిపురం సర్పంచ్ మొయ్యి మోహనరావు, రాము, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్, ఏపీఓ త్రినాథరావు, పోతురాజుపేట దామోదరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల ముంగిటకే అన్ని సేవలూ అందుతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని అలజంగిలో ఆధార్ అప్‌డేషన్ సేవల కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రజలు ఆధార్ కార్డులో తప్పుల సరవణ, అప్‌డేషన్ కోసం మండల కేంద్రానికి పరుగులు పెట్టాల్సిన అవసరం లేకుండా గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వమే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. వాటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, సర్పంచ్ రేజేటి భద్రమ్మ, ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కనీసం వేతనం అందించేందుకు చర్యలు

వంగర: ఉపాధిహామీ వేతనదారులకు కనీస వేతనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని సంగాంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేపడితే 272 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సామంతుల సంగంనాయుడు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

బీమా పాలసీని సద్వినియోగం చేసుకోండి..

వంగర: భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) అందిస్తున్న బీమా పాలసీలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ వంగర బ్రాంచ్ మేనేజర్ ఎం. శేఖర్ అన్నారు. మండల పరిధిలోని కె.కొత్తవలసలో బ్యాంక్ ఖాతాదారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ వంటి పథకాలను బ్యాంక్ అందిస్తోందని చెప్పారు. అలాగే వర్తక, వాణిజ్య, తయారీ పరిశ్రమల స్థాపనకు, పశుపోషణ, మత్స్యకారులకు వివిధ రకాల రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

రాజాం సిటీ: డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ నక్క వర్షిణి అన్నారు. మండల పరిధిలోని బొద్దాంలో వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కంటివెలుగు కార్యక్రమం వృద్ధుల పాలిట వరమన్నారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా నేత్ర సంబంధిత వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎ.గోపాలరావు, ఏఎన్‌ఎం మన్మథ, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క రాజు, ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

68 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక

తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి నవజీవన్ ట్రస్ట్ సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 147 మందికి డాక్టర్ రత్నం కంటి పరీక్షలు చేశారు. వారిలో 68 మందిని కేటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. శస్త్రచికిత్సకు ఎంపికైన వారికిఇ ఉచితంగా ఆపరేషన్లు చేయడంతో పాటు కళ్లద్దాలు అందివ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ క్యాంప్ ఆర్గనైజర్ రమణ, స్పందన సంస్థ అధ్యక్షుడు వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల సత్తా..



బుక్కా త్రివేణి (ప్రథమ ఒకేషనల్ - 428)



కానూరు తేజశ్విని (ఎంపీసీ - 965)



బొడ్డేపల్లి జగన్నాథం (ఎంపీసీ - 957)



పొగిరి మౌనికశ్రీ (సీఈసీ - 821)



తాలాడ సంగీత (ఒకేషనల్ - 888)



తమరాన శివానిచందు (ఒకేషనల్ - 885)



దాసరి లోకేశ్వరరావు (ఒకేషనల్ - 852)



కృష్ణవేణి (సీఈసీ - 892)



బూడి పద్మావతి (ఎంపీసీ - 985)



హరిప్రియ (ఎంపీసీ - 986)



ఆర్.లక్ష్మి (బైపీసీ 983)



నిఖిత (ప్రథమ ఎంపీసీ - 464)



జ్యోత్స్న (ప్రథమ బైపీసీ - 429)

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో చక్కని ప్రతిభ కనబరిచారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు మంచి మార్కులు సాధించి, ఔరా అనిపించుకున్నారు.

ప్రైవేట్ కళాశాలల ప్రభంజనం..

రాజాం : పట్టణంలో గాయత్రి, శ్రీచైతన్య కళాశాలలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

వైకల్యాన్ని అధిగమించి..

సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివిన ఉప్పాడ కృష్ణవేణి సత్తా చాటింది. పుట్టుకతోనే పోలియో కారణంగా రెండు చేతులతో పాటు కుడి కాలుకి కూడా వైకల్యం సంభవించింది. అయినప్పటికీ ఎంతోకష్టపడి ఇంటర్ సీఈసీలో 892 మార్కులు సాధించింది.